క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్‌కు చెందిన జాగర్ల ఉపేంద్రకు గుండె సంబంధ ఆపరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ ప్రభుత్వం ద్వారా రూ. రెండు లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని ఉపేంద్ర బంధువులకు సునీల్‌కుమార్ పంపిన ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎఫ్ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టి ఇవ్వాలి



బోధన్: నిజాం షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు, ఖాళీ స్థలాల్లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టి ఇవ్వాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ప్రాంతంలోగల పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రతినిధి ఎండీ మోసిన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సభ్యుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేదలకు దక్కాల్సిన ఇందిరమ్మ ఇళ్లను కొందరు అధికార పక్ష నాయకులు తమ కుటుంబ సభ్యులకు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. నాయకులు కర్రోల శ్రీనివాస్, రాజశేఖర్, తోట సంగీత, ఉషా, సామెల్, రవి, అంజన్న పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బాల్కొండ: మండల కేంద్రంలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల వద్ద విద్యార్థిసేనా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ నాయక్, వికాస్, సతీశ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో నర్సరీని ఎంపీడీవో నరేశ్‌ఆనంద్ శనివారం పరిశీలించారు. నర్సరీలో పెంచిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీవో గౌస్‌మొయినొద్దీన్, ఎఫ్‌వే జగదీశ్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ఆర్మూర్‌టౌన్: పర్యావరణాన్ని హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని మున్సిపల్ శానిటరి పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 27, 30వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వార్డు అధికారులు నితిన్, నీలిమ, నర్సయ్య, రవి, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా నిర్మించుకోవాలి

వర్ని: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నాణ్యతగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రమేశ్ సూచించారు. శనివారం మండలంలోని గోవూరు గ్రామంలో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో ఉన్న నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని జీపీ కార్యదర్శికి సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. చిక్కడపల్లి పాఠశాల ఆవరణలో ఉన్న శ్రీ సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజలు చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, చంద్రకళ, ఉపాధ్యాయులు ప్రకాశ్, రమేశ్, సుజాత, పద్మ, సంధ్యారాణి, ఆశావర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

25న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన మండల స్థాయి ఎంపికలు ఆదివారం కొనసాగుతాయని, జిల్లాస్థాయి ఎంపికలను 25వ తేదీన ఉదయం 9గంటలకు రాజారాం స్టేడియంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

సరిపోని నిధులు.. ఆగిన పనులు

- చివరి దశలో నిలిచిపోయిన హెల్త్ సబ్ సెంటర్ భవనాలు
- అదనపు నిధుల కోసం వేచి చూస్తున్న అధికారులు



మారంపల్లిలో నిలిచిన హెల్త్ సబ్ సెంటర్



భవనానికి ఏర్పడిన పగుళ్లు

డొంకేశ్వర్: గత ప్రభుత్వం డొంకేశ్వర్ మండలంలో మూడు హెల్త్ సబ్ సెంటర్లకు సొంత భవనాలు మంజూరు చేసింది. రెండేళ్లయినా ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. కారణం, అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నిధులు సరిపోకపోవడమే. కాంట్రాక్టర్ చివరి దశలో పనులను ఆపేయడంతో ఈ భవనాలు ఆకతాయిలకు, మందు బాబులకు అడ్డాగా మారాయి. అదనపు నిధుల కోసం పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్ర శాఖకు లేఖ రాసినా ఇంత వరకు మంజూరు కాలేదు. మారంపల్లి, నూత్‌పల్లి, గాదేపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాలను నిర్మించడానికి స్థలాలు చూసి 15వ ఆర్థిక సంఘం కింద ఒక్కో దానికి రూ.20లక్షలు మంజూరు చేసింది గత ప్రభుత్వం. ఈ మూడు భవనాలను నిర్మించే పనులను ఒకే కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. రూ.20లక్షలు సరిపోకపోవడంతో మంజూరైన డబ్బుల మట్టుకే కాంట్రాక్టర్ పనులు చేశాడు. ప్రస్తుతం గోడలు, స్లాబు పనులు పూర్తి కాగా లోపల ఫ్లోరింగ్, కిటికీలు, ప్రధాన ద్వారం తలుపులు, ఎలక్ట్రిసిటీ, ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నాసిరకం పనులతో పగుళ్లు

హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయి. నాణ్యమైన ఇసుక వాడకపోవడంతో పాటు వాటర్ క్యూరింగ్ సరిగ్గా చేయకపోవడంతో భవనానికి అంతటా పగుళ్లు వచ్చాయి. అధికారులు పర్యవేక్షణ చేసినా పనులు నాసిరకంగా జరగడంపై స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ రాజ్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఒక్కో భవనానికి అదనంగా రూ.5లక్షలు కావాలని రాష్ట్ర శాఖను కోరామని, పనుల నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు.

నిర్మాణం పూర్తయినా నిరుపయోగమే.!



కేజీబీవీ భవనం

బాల్కొండ : ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ నూతన భవనం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవనం ప్రారంభిస్తారని ఆశించినా విద్యార్థులకు నిరాశే మిగిలింది. కేజీబీవీ ప్రస్తుతం మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. పాఠశాలలో 260 మంది విద్యార్థులు చదువుతున్నారు. భవన నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతూ.. నాలుగేళ్లకు కాంట్రాక్టర్ పూర్తి చేశాడు. పూర్తయిన భవనాన్ని సంబంధిత అధికారులకు అప్పగించాలి. కానీ బిల్లులు అందలేదని కాంట్రాక్టర్ అప్పగించలేదు. దీంతో భవనం పూర్తయినా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. బిల్లులకు అప్పగింతకు లింకు పెట్టడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ విషయమై ఏఈ మురళిని 'సాక్షి' ఫోన్‌లో పలుమార్లు సంప్రదించగా ఆయన స్పందించలేదు. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

నందిపేట్: మండలంలోని రైతుఫారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాగేశ్వర రావు, బుజ్జి, జమీల్, గోజి రాజేందర్, నిఖిల్, రోజారాజు, నాయకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు మంచి ప్రోత్సాహం



తినుబండారాలను పరిశీలిస్తున్న జడ్జి శ్రీదేవి

ఆర్మూర్‌టౌన్: చిరు వ్యాపారులు ఇంట్లో తయారు చేసి విక్రయిస్తున్న హోమ్‌ఫుడ్‌ను ప్రజలు కొనుగోలు చేయడం ద్వారా వారికి మంచి ప్రోత్సాహం అందించిన వారిమవుతామని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పట్టణ పేదరిక నిర్మూలన మెప్మా ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. స్టాల్ ఏర్పాటుతో చిరు వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఫుడ్‌ఫెస్టివల్‌లోని స్టాల్‌ను సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా టీఎంసీ ఉదయ్‌శ్రీ, ఆర్‌వో ఉమాదేవి, ఆర్పీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: చిరు వ్యాపారులు ఇంట్లో తయారు చేసి విక్రయిస్తున్న హోమ్‌ఫుడ్‌ను ప్రజలు కొనుగోలు చేయడం ద్వారా వారికి మంచి ప్రోత్సాహం అందించిన వారిమవుతామని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పట్టణ పేదరిక నిర్మూలన మెప్మా ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి హాజరై మాట్లాడారు. స్టాల్ ఏర్పాటుతో చిరు వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఫుడ్‌ఫెస్టివల్‌లోని స్టాల్‌ను సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా టీఎంసీ ఉదయ్‌శ్రీ, ఆర్‌వో ఉమాదేవి, ఆర్పీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కమ్మర్‌పల్లి: పాఠశాల దశలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సై అనిల్‌రెడ్డి సూచించారు. కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్సై నరేందర్, హెచ్‌ఎం సాయన్న పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్: గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. మండలంలోని నీలా గ్రామంలో శనివారం హెస్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో నో డ్రగ్స్ ఆకారంలో నినాదాలు చేయించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు బోర్డు ప్రారంభ కార్యక్రమానికి తరలిరావాలి



- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

ఆర్మూర్: జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అధ్యక్షతన పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్‌తో కలిసి పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతీ గ్రామంలో రైతులకు ఉపయోగపడే పసుపు బోర్డు ఏర్పాటు లాంటి కార్యక్రమాలతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరువుతున్నారని కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అనిల్, నాయకులు పాల్కం వేణు, ఆకుల రాజు, పాన్ శీను, జాకిర్దర్ శీను, సుంకరి రంగన్న, గుగులోత్ తిరుపతి నాయక్, ఖాందేశ్ ప్రశాంత్, బాండ్లపల్లి నర్సారెడ్డి, చిన్నా రెడ్డి పాల్గొన్నారు.

బాల్కొండలో రథయాత్ర చేపడుతున్న భక్తులు, చిన్నారులు



వైభవంగా జగన్నాథ రథయాత్ర

బాల్కొండ: మండల కేంద్రంలో జగన్నాథ రథయాత్రను ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా రథయాత్ర కొనసాగింది. ప్రజలు, చిన్నారులు రథాన్ని లాగారు. శ్రీకృష్ణ మందిరంలో భక్తులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



సాలూరలోని వాగ్దేవి విద్యా నికేతన్‌లో యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు



బోధన్ కోర్టులో యోగాసనాలు చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో యోగా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు యోగా కార్యక్రమాల్లో పాల్గొని యోగసనాలు వేశారు. బోధన్‌లో పతంజలి యోగాధ్యాన కేంద్రం, ఓం యోగశాల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకల్లో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్‌లో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో శ్రీలంకలోని క్యాండీ నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులు శ్రీలంక పర్యటనలో ఉండటం వల్ల యోగా దినోత్సవాన్ని అక్కడే చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



బోధన్‌లో యోగాసనాల ప్రదర్శనను తిలకిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



డొంకేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..



పెర్కిట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా డే ఆకారంలో విద్యార్థులు



బాల్కొండ మోడల్ పాఠశాలలో..



వేల్పూర్: అంక్సాపూర్ హైస్కూలులో యోగా డే ఆకారంలో విద్యార్థులు



మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో..



మామిడిపల్లిలోని విజయ్ హైస్కూల్‌లో..



ఆర్మూర్ కోర్టులో యోగా చేస్తున్న న్యాయమూర్తులు



రుద్రూర్ ప్రధాన చౌరస్తాలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు



బోధన్: యోగాదినోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో..

సంక్షిప్తం

డెస్క్ బెంచీల వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రముఖ వ్యాపార సంస్థ వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్స్ యాజమాన్యం డ్యూయెల్ డెస్క్ బెంచీలను శనివారం వితరణ చేసింది. కార్యక్రమంలో సంస్థ యజమాని ఏనుగు దయానంద్ రెడ్డి, హెచ్‌ఎం కనక గంగాధర్, పీడీ రాజ్‌కుమార్, వీడీసీ ఉపాధ్యక్షుడు నేళ్ల హరీశ్, నాయకులు శ్రీరాముల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మడిగెలకు వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న కాంప్లెక్స్ మడిగెలకు దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సమక్షంలో శనివారం వేలం నిర్వహించారు. ఆలయ ఈవో మాట్లాడుతూ.. కాంప్లెక్స్ రెండులో ఉన్న ఏడు మడిగెలకు, కాంప్లెక్స్ మూడులో ఉన్న నాలుగు మడిగెలకు వేలం నిర్వహించి రెండేళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, రమణ, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న హనుమాన్, అయ్యప్ప, అష్టలక్ష్మి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ రేగుల సత్యనారాయణ, డైరెక్టర్ రమణ, జంగిడి భోజన్న పింజా అభినవ్, నారాయణరెడ్డి, చిట్యాల నవీన్, కిశోర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమ్మర్‌పల్లి: మండలంలో పలువురు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం రాజేశ్వర్, సుధాకర్, కొంటికంటి నరేందర్, పాషా, బద్దం చిన్నారెడ్డి, ఏనుగు రాజేశ్వర్, అవారి మురళి, అనిల్ ఉన్నారు.



ఉప్లూర్‌లో..

మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి పరామర్శించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు రవి, బుచ్చిమల్లయ్య, వేముల గంగారెడ్డి, ఎరుకల గణేశ్, సల్లూరి గణేశ్, దూలురు కిషన్‌గౌడ్, అజార్, ప్రదీప్, కొమ్ముల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో సాగర్ కాలువలు

- విరిగిన షట్టర్లు
- పంటలకు అందని సాగునీరు
- ఇబ్బందిపడుతున్న రైతులు



నిజాంసాగర్ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు



తూములకు అడ్డంగా పడిఉన్న షట్టర్లు

నందిపేట్ : రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ. కోట్ల నిధులు వెచ్చించి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోంది. అదే ప్రభుత్వం పొలాలకు నేరుగా సాగునీరు అందించేందుకు నిర్మించిన కాలువలు, తూములకు మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో తూములు, కల్వర్టులు, కాలువలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రధాన కాలువల్లో పిచ్చి మొక్కలు పేరుకుపోయి నీటిని దిగువకు చేరకుండా అడ్డుపడే ప్రమాదం ఉంది. అంతే కాకుండా షట్టర్లు విరిగి పోవడం, మరికొన్నింటిని దొంగలు ఎత్తుకెళ్లడంతో నీరు వృథాగా పోతోంది. కాలువల నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టక పోవడం బాధకరం. ప్రధాన కాలువలే కాకుండా పంట పొలాలలకు సాగునీరు అందించడానికి పిల్ల కాలువలు సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. వీటి మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. నందిపేట మండల పరిధిలో డిస్ట్రిబ్యూటరి కెనాల్ 74 ప్రధాన కాలువ 19 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. దీనికి 11 సబ్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. నాలుగింటికి మాత్రమే షట్టర్లు ఉన్నాయి. ఈ ప్రధాన కాలువ ద్వారా నందిపేట, మాక్లూర్ మండలాల్లోని సుమారు 26 గ్రామాలకు సాగునీరు అందించాలి. కానీ ప్రతి ఏడాది నందిపేట మండలంలోని ఆంధ్రనగర్, వెల్మల్, అయిలాపూర్, కంఠం గ్రామాలకు మాత్రమే నీరు చేరుతోంది. నిజాంసాగర్ ప్రధాన కాలువలు, పిల్లతూములు, తూములు, షట్టర్లు, మరమ్మతులు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రధాన కాలువతో పాటు 82 డిస్ట్రిబ్యూటరు కాలువల జంగల్ కటింగ్, తూముల మరమ్మతులు, ఇసుక మేటల తొలగింపు పనులను చేపట్టి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి

నిజాంసాగర్ ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీలు, తూములు, షట్టర్లు, కాలువ కట్టలకు పడ్డ గండ్లు, లీకేజీల కోసం ఇరిగేషన్ అధికారులు విడతల వారిగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

– మొగులాజీ, రైతు, బజార్‌కొత్తూర్

మరమ్మతులు చేపట్టాలి

నిజాంసాగర్ కాలువలకు మరమత్తులు చేపట్టాలి. ఇందులో భాగంగా కాల్వలకు సీసీ లైనింగ్ పనుల తో పాటు లీకేజీలను సరిచేయాలి. చివరి ఆయకట్టు వరకు నీరందించేలా అధికారులు తగు చర్యలు తీ సుకోవాలి.

– మచ్చర్ల చిన్న సాయిలు, రైతు, నందిపేట

నేడు ఉచిత వైద్య శిబిరం

నందిపేట్: మండల సమీపంలో ఉన్న కేదారీశ్వర ఆశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.